సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 13 । సెప్టెంబర్ । 2022

సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో లోహిత్‌కు బంగారు పతకాలు



డుంబ్రిగుడ: అరకులోయ క్రీడా పాఠశాలలో చదువుతున్న మండలంలోని తూటంగి పంచాయతీ గేదెలబంద గ్రామానికి చెందిన శెట్టి లోహిత్ పరుగు పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించాడు. లోహిత్ ఏడాదిగా ఏలూరులో ఉంటూ కోచ్‌లు వినయ్ ప్రసాద్, గణపతి సహకారంతో శిక్షణ పొందుతున్నాడు. ఈ నెల 9 నుంచి11 వరకు గుంటూరులో జరిగిన 33వ సౌత్ జోన్ జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్‌లో 200,400 మీటర్ల పరుగు పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించాడు. లోహిత్‌ను క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ మూర్తి,కోచ్‌లు అభినందించారు. ఈ నెల 17 నుంచి 19 వరకు భోపాల్‌లో జరిగే పోటీలకు లోహిత్ ఎంపికైనట్టు కోచ్‌లు సోమవారం తెలిపారు.

కూలిన పెంకుటిళ్ల గోడలు



జి.మాడుగుల: భారీ వర్షాలకు రెండు పెంకుటిళ్ల గోడలు కూలిపోయాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వెనుక ఉన్న గొల్లోరి మత్స్యలింగానికి చెందిన పెంకుటింటి గోడ, గడుతూరు పంచాయతీ రాళ్లపుట్టు గ్రామానికి చెందిన కొర్రా అప్పారావుకు పెంకుటింటి గోడ కూలిపోయాయి. దీంతో ఆయా కుంటుంబాలవారు నిరాశ్రయులయ్యారు.

న్యూస్‌రీల్

బాలికల గురుకుల కళాశాలల్లో 245 సీట్లు పెంపు

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏ పరిధిలోని గిరిజన బాలికల గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం(ఇంగ్లిష్ మీడియం)లో 245 సీట్లను ప్రభుత్వం అదనంగా పెంచినట్టు ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ జాబితాను ఐటీడీఏ కార్యాలయం, గురుకుల సెల్, సంబంధిత కళాశాలలవద్ద ప్రదర్శించామని పేర్కొన్నారు. మెరిట్ ఆధారంగా బాలికలను ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఎంపిక చేయనున్నామని తెలిపారు. బాలికల కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులు సంబంధిత కళాశాల నోటీసు బోర్డులో పొందుపర్చిన మెరిట్ జాబితాను పరిశీలించి, ఆయా కళాశాలల్లో వెంటనే చేరాలన్నారు. అరకులోయ బాలికల కళాశాలలో ఎంపీసీ 10, బైపీసీ 10, సీఈసీ 10, హెచ్‌ఈసీ 10, పాడేరు బాలికల కళాశాలలో ఎంపీసీ 20, బైపీసీ 20, హెచ్‌ఈసీ 20, ఎఅండ్‌టీ 20, సీజీఏలో 15 సీట్లు పెంచినట్టు తెలిపారు. జి.కె.వీధి ఆర్‌జేసీ బాలికల కళాశాలలో ఎంపీసీ 10, బైపీసీ 10, సీఈసీ 10 సీట్లు, కొయ్యూరు ఆర్‌జేసీ బాలికల కళాశాలలో ఎంపీసీ 20, బైపీసీ 20, సీఈసీ 20, ఎంఈసీ 20 సీట్లు పెంచినట్టు పేర్కొన్నారు.

మద్దిగడ్డ జలాశయానికి భారీగా వరద నీరు



మద్దిగడ్డ జలాశయం నుంచి దిగువకు విడిచిపెడుతున్న నీరు

అడ్డతీగల: మద్దిగడ్డ జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో సోమవారం నీటిపారుదలశాఖ అధికారులు జలాశయం రెండో గేటును 20 సెంటీమీటర్లు పైకెత్తి దిగువకు నీటిని విడిచిపెడుతున్నారు. రెండు రోజులుగా జలాశయం ఎగువప్రాంతంలో వర్షాలు కురుస్తుండడంతో భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 188 మీటర్లు కాగా, ఆదివారం అర్ధరాత్రి 187.25 మీటర్లు దాటింది. భారీ స్థాయిలో వరద నీరు రావడాన్ని గమనించిన వెంటనే రెండో గేటును 20 సెంటీమీటర్ల మేర పైకి ఎత్తి గంటకు 210 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెడుతున్నట్టు మద్దిగడ్డ జలాశయం అసిస్టెంట్ ఇంజినీరు గోపీకృష్ణ తెలిపారు. ఏలేరు వాగు పరీవాహక గ్రామాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి అప్రమత్తంగా ఉండాలని ఏఈ కోరారు.

పొంగిన వాగులు

నిలిచిన రాకపోకలు



చింతూరు వద్ద రహదారిపై ప్రవహిస్తున్న చీకటివాగు

చింతూరు: శబరినది ఉధృతి కారణంగా చింతూరు మండలంలో పలు వాగులు పొంగి వరదనీరు రహదారుల పైనుంచి ప్రవహిస్తోంది. కుయిగూరు, నిమ్మలగూడెం నడుమ కుయిగూరువాగు పొంగి వరదనీరు జాతీయ రహదారి–326పైకి చేరడంతో ఆంధ్రా నుంచి ఒడిశా రాష్ట్రానికి, కల్లేరు పంచాయతీ పరిధిలోని మదుగూరు, సూరన్నగొంది, కల్లేరు, కుయిగూరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం చీకటివాగు నీరు రహదారిపైకి చేరడంతో చూటూరుకు కూడా రాకపోకలు నిలిచిపోయాయి. చింతూరు వద్ద శబరినది నీటిమట్టం 31 అడుగులకు చేరుకుని నిలకడగా ఉంది. దిగువనున్న గోదావరి ప్రవాహం పెరుగుతుండడంతో శబరినది ఎగపోటుకు గురై మంగళవారం నుంచి మరింత పెరిగే అవకాశముంది. ఎగువనున్న ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కూడా భారీ వర్షాలు పడుతున్నాయి. వచ్చే వరదనీరు కారణంగా శబరినది ప్రవాహం ఇంకా పెరిగే అవకాశముండడంతో పరీవాహక ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఈపీడీసీఎల్ డైరెక్టర్‌గా చంద్రం కొనసాగింపు

సాక్షి, విశాఖపట్నం : తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ (ఫైనాన్స్–హెచ్‌ఆర్ డి)గా విధులు నిర్వహిస్తున్న డి.చంద్రం పదవీకాలాన్ని రెండేళ్లు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఐఆర్‌ఏఎస్ సర్వీసుకు చెందిన చంద్రం 2020లో ఈపీడీసీఎల్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన సేవలకు గుర్తింపుగా 2024 నవంబర్ వరకు కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ సీఎండీ కె.సంతోషరావు జీవోలో పేర్కొన్నారు.



థ్యాంక్యూ సీఎం సార్

వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలను అక్టోబర్ 1తేదీ నుంచి అమలు చేయనుండడంపై జిల్లా వ్యాప్తంగా ఆనందోత్సాహాలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం పాడేరులో ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి ఆదేశాల మేరకు ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్భ నర్సింగరావు ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలుపుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అరకులోయ, జీకే వీధి, చింతపల్లి, కొయ్యూరు, రంపచోడవరం నియోజకవర్గం రాజవొమ్మంగి తదితర మండలాల్లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

16న పాడేరులో మెగా జాబ్‌మేళా

- 11 సంస్థల్లో 770 ఉద్యోగాల భర్తీకి చర్యలు
- కరపత్రాల ఆవిష్కరణలో కలెక్టర్ సుమిత్ కుమార్




మెగా జాబ్‌మేళా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 16న మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 11 సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి సంబంధించి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ప్రచార కరపత్రాలను ఆయన సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అపోలో ఫార్మసీ, మదర్ అండ్ ఫాదర్ నర్సింగ్ సర్వీసెస్, ఎస్‌బీఐ కార్డ్స్, వరుణ్ మోటార్స్, పేటీఎం సర్వీసెస్, డెక్కన్ కెమికల్స్, అరబిందో ఫార్మా స్యూటికల్స్, హెటిరో డ్రగ్స్, నవతా రోడ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్స్, ఎంఎస్‌ఎన్ లేబోరేటరీస్, మోహన్ స్పిన్‌టెక్స్ తదితర 11 సంస్థల్లో 770 ఉద్యోగాలు భర్తీకి ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్హతలు కలిగిన 18నుంచి 30ఏళ్లలోపు వయస్సు ఉన్న యువతీ, యువకులంతా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జాబ్‌మేళాకు హాజరైన తర్వాత ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, అనకాపల్లి, పాడేరు, అరకు, నర్సీపట్నం, గాజువాక, తుని, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. వారి అర్హతలు, ఎంపిక చేసిన సంస్థల ఆధారంగా అభ్యర్థులకు రూ.10వేల నుంచి రూ.20వేల వరకు వేతనం లభిస్తుందని, ఈ జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు దరఖాస్తుతో పాటు విద్యార్హతలు, ఆధార్, పాన్‌కార్డు జెరాక్స్ కాపీలతో పాటు పాస్‌ఫొటోలను తీసుకురావాలని, మరిన్ని వివరాలకు 94917 86463, 63026 36174 నంబర్లలో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఈ కరపత్రాల ఆవిష్కరణలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.రోహిణి, సంస్థ సిబ్బంది గంగాజీ, పవన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అనకాపల్లిలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

పాల్గొననున్న పార్టీ ఉమ్మడి విశాఖ రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



సాక్షి, అనకాపల్లి: అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం మంగళవారం జరగనుంది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి పాల్గొని జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ముఖ్యనాయకులతో సమావేశం కానున్నారు. ఈ సమావేశంతోపాటు ఆయన మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 9.30 గంటలకు పెందుర్తి నియోజకవర్గం రాంపురం గ్రామంలో మహానేత వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. 10.30 గంటలకు అనకాపల్లి కొత్తూరు జంక్షన్‌లో గల పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగే విస్తృతస్థాయి సమావేశానికి హాజరవుతారు. మధ్యాహ్నం 3 గంటలకు పెందుర్తి నియోజకవర్గంలోని నడుపూరులో జగనన్న హౌసింగ్ కాలనీ భూమి పూజలో పాల్గొంటారు.

మరో లక్ష ఎకరాల్లో కాఫీ సాగు విస్తరణ

- ప్రణాళిక సిద్ధం చేయాలి
- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశాలు



అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో రానున్న ఐదేళ్లలో మరో లక్ష ఎకరాల్లో కాఫీ సాగును విస్తరించనున్నట్టు ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో ఉద్యాన వన, వ్యవసాయ, కాఫీ విభాగం అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పాడేరు ఐటీడీఏ పరిధిలోని 2,33,000 ఎకరాల్లో ప్రస్తుతం కాఫీ సాగవుతోందని, ఫలసాయం ఇచ్చే తోటల ద్వారా 71వేల మెట్రిక్ టన్నుల కాఫీ పండ్లు ప్రతీ ఏడాది దిగుబడి అవుతున్నాయని చెప్పారు. 16వేల మెట్రిక్ టన్నుల కాఫీ పల్పింగ్ చేయాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. కాఫీ తోటలను విస్తరించేందుకు ప్రణాళికలను పారదర్శకంగా రూపొందించాలని సూచించారు. జి.మాడుగుల, జీకే వీధి ప్రాంతాల్లో ఎకో పల్పింగ్ యూనిట్లను నెలకొల్పుతామని తెలిపారు. కాఫీ రైతులను మాక్స్ సొసైటీలో సభ్యులుగా చేర్చాలని అధికారులకు సూచించారు. కాఫీ పండ్లను సేకరించి ఎకో పల్పింగ్ యూనిట్‌కు చేర్చాల్సిన బాధ్యత కాఫీ క్షేత్రస్థాయి సిబ్బందిపైనే ఉందన్నారు. ప్రతి మండల కేంద్రంలో కాఫీ విభాగ కార్యాలయాలను ఏర్పాటు చేసి, అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూరుస్తామని పీవో తెలిపారు. కాఫీ సాగులో రైతులకు అవగాహన కల్పించేందుకు శిక్షణ తరగతులను నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, అన్ని మండలాల ఉద్యాన వన, వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

మున్నూరు..ఆనందాల జోరు

- బీసీడీ జాబితాలోకి మున్నూరుకాపులు
- తమ కష్టాలు తీరాయని విద్యార్థుల ఆనందం
- ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షం



ముఖ్యమంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న మున్నూరు కాపు సంఘం నేతలు

ఎటపాక: విలీన మండలాల్లోని మున్నూరుకాపుల కష్టాలు తీరాయి. బీసీ 'డి' కులధృవీకరణ పత్రాల మంజూరుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్ర విభజనతో బీసీ 'డి' కుల ధృవీకరణ పత్రాల జారీని గత ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో ఏడు సంవత్సరాలుగా ఆరు మండలాల్లోని సుమారు 12 వందల కుటుంబాల్లోని 10వేల మంది తీవ ఇబ్బందులు పడుతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో విలీనమైన చింతూరు,ఎటపాక, కూనవరం,వీఆర్‌పురం, పశ్చిమగోదావరి జిల్లాలోని వెలేరుపాడు,కుకునూరు,బూర్గంపాడు (కొన్ని పంచాయతీలు)మండలాల్లోని మున్నూరు కాపులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీసీ 'డి' జాబితాలో ఉండేవారు. అయితే 2014లో రాష్ట్ర విభజనతో ఏడు మండలాలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనమయ్యాయి. ఆనాటి టీడీపీ ప్రభుత్వం 2016 నుంచి మున్నూరుకాపులకు బీసీ 'డి' సర్టిఫికెట్ల మంజూరు నిలిపివేసింది. దీంతో వందలాది మంది విద్యార్థులు రిజర్వేషన్లు కోల్పోవలసి వచ్చింది. 2017 నుంచి విలీన మండలాల్లోని మున్నూరు కాపుల బీసీ 'డి' సర్టిఫికెట్లు కోసం అధికారులకు,ప్రజాప్రతినిధులకు అనేక వినతులు ఇచ్చి విసిగిపోయారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వీరి సమస్యల పరిష్కారానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి,పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కాపుకార్పొరేషన్ చైర్మన్ అడప శేషు ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లారు.ఇటీవల వరదల సమయంలో విలీన మండలాల పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డిని కలిసిన సంఘం నేతలు సమస్యను వివరించడంతో సీఎం సానుకూలంగా స్పందించారు.ఇచ్చిన హామీ మేరకు విలీన మండలాల్లోని మున్నూరు కాపులకు బీసీ 'డి' సర్టిఫికెట్లు జారీ చేసేందుకు గత నెల 17న జీవో జారీ చేయడంతో మున్నూరు కాపుల్లో ఆనందం వెల్లువిరిసింది.గత వారం నుంచి కుల ధృవీకరణ పత్రాలు పొందుతున్నారు. ప్రభుత్వానికి రుణపడి ఉన్నామని వారు తెలిపారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డిని మున్నూరుకాపు సంఘం నేతలు సోమవారం సీఎం కార్యాలయంలో కలిశారు. బీసీ 'డి' కులధృవీకరణ పత్రాలు ఇచ్చేందుకు ప్రభుత్వం జీవో జారీ చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు.ఈసందర్భంగా సీఎంను దుశ్శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.కాపు కార్పొరేషన్ చైర్మన్ అడప శేషు ద్వారా సీఎంను కలిసిన వారిలో సంఘం డివిజన్ అధ్యక్షుడు ఆకిశెట్టి ఉమాశంకర్‌నాయుడు,ఎటపాక మండల అధ్యక్షుడు గంజి వెంకటేశ్వరరావు ,కమిటీ సభ్యులు బండారు శివాజీ, రంబాల నాగేశ్వరరావు,అమరవరపు నాగేంద్ర ఉన్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షనీయం



మున్నూరు కాపుల సమస్యను ప్రభుత్వం గుర్తించింది. బీసీ 'డి' సర్టిఫికెట్లు ఇచ్చేందుకు జీవో విడుదల చేయడం హర్షనీయం.మేమంతా ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

–మారాసు సత్యనారాయణ, ఎటపాక

ఎన్నో ఇబ్బందులు పడ్డాం



గత ఏడేళ్లుగా ఎన్నో ఇబ్బందులు పడ్డాం. బీసీ– డి సర్టిఫికెట్ల జారీ నిలిపివేయడంతో మా పిల్లల చదువులకు ఆర్థికంగా అనేక కష్టాలు ఎదుర్కొన్నాం.ముఖ్యమంత్రి నిర్ణయం ఎందరో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపింది. –ములిశెట్టి రమేష్, గన్నవరం

వెనక సీట్లోనూ బెల్టు తప్పనిసరి

- కార్లలో వెనక కూర్చున్న వారూ ధరించాల్సిందే..
- కొన్నాళ్ల పాటు వాహన చోదకులకు అవగాహన
- ఆపై రూ.వెయ్యి వరకు జరిమానా
- సైరస్ మిస్త్రీ మరణం నేపథ్యంలో రవాణాశాఖ అలెర్ట్



సాక్షి, విశాఖపట్నం: కార్లలో వెనక సీట్లో కూర్చుని ప్రయాణిస్తున్న వారు కూడా ఇకపై సీటు బెల్టు ధరించడం తప్పనిసరి. కార్లు/జీపుల్లో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలన్న నిబంధన గతం నుంచే ఉంది. సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్స్ 138(3) ప్రకారం సీటు బెల్టు (ముందు, వెనక సీట్లలో) ధరించక పోవడం నేరం. దీనిని అతిక్రమించిన వారికి రూ.వెయ్యి వరకు జరిమానా విధించే అధికారం రవాణా శాఖ అధికారులకు ఉంటుంది. అయితే ఇన్నాళ్లూ ముందు సీట్లలో కూర్చున్న వారికే ఈ నిబంధన పరిమితం అన్న భావన చాలా మందిలో ఉంది. దీంతో రవాణా శాఖ అధికారులు, పోలీసులు సీటు బెల్టు ధరించని వాహనదార్లపై అడపా దడపా కేసులు నమోదు చేస్తున్నారు. ఇటీవల టాటా సన్స్ మాజీ చైర్మన్ సైరస్ మిస్త్రీ కారు ప్రమాదంలో మరణించారు. మిస్త్రీ తాను ప్రయాణిస్తున్న కారు వెనక సీట్లో సీటు బెల్టు ధరించకుండా కూర్చుని ఉండగా ప్రమాదానికి గురై మృత్యువాత పడ్డారు. ఈ నేపథ్యంలో వెనక సీట్లో కూర్చున్న వారు సైతం సీటు బెల్టు ధారణ ఆవశ్యకతపై సర్వత్రా చర్చనీయాంశమైంది. దీనిపై కేంద్ర ఉపరితల రవాణా, రహదారుల శాఖామంత్రి నితిన్ గడ్కరీ కార్లలో వెనక సీట్లలో కూర్చున్న వారు సైతం సీటు బెల్టు ధరించేలా ఉన్న నిబంధనలు అమలు చేసేలా, ఉల్లంఘించిన వారికి రూ.వెయ్యి వరకు జరిమానా విధించేలా ఉత్తర్వులు జారీ చేస్తామని కొద్దిరోజుల క్రితం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధి విధానాలను త్వరలోనే వెల్లడిస్తామని చెప్పారు. దీంతో రవాణా శాఖ అధికారులు కేంద్రం నుంచి విడుదలయ్యే ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నారు. మరోవైపు కార్లలో సీటు బెల్టు ఆవశ్యకతతో పాటు వెనక సీట్లో కూర్చున్న వారు కూడా విధిగా ధరించేలా వాహనదార్లకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు. సుమారు నెల రోజుల పాటు అవగాహన కల్పించాక సీటు బెల్టులు ధరించని వారిపై కేసులు నమోదు చేయాలని యోచిస్తున్నారు.

ఒక శాతం కంటే తక్కువే..

సేవ్ లైఫ్ ఫౌండేషన్ అనే సంస్థ జరిపిన అధ్యయనంలో దేశంలో కారు వెనక సీట్లో సీటు బెల్టులు ధరించకుండా ప్రయాణిస్తున్న వారి సంఖ్య ఒక శాతంకంటే తక్కువగా ఉందని తేలింది. సీటు బెల్టు ధరించకుండా కారులో ప్రయాణించడం నేరం అన్న సంగతి 37.8 శాతం మందికి తెలియదని పేర్కొంది. 23.9 శాతం మందికి వెనక సీట్లో సీటు బెల్టులున్నాయన్న విషయం తెలియదని తెలిపింది.

కార్లలో అలెర్ట్ సిస్టం

మార్కెట్లోకి కొత్తగా వచ్చే కార్లలో ముందు సీట్లో కూర్చుని సీటు బెల్టు ధరించని పక్షంలో అలెర్ట్ చేసేలా సాంకేతికతను అందుబాటులోకి తెచ్చారు. దీంతో సీటు బెల్టు ధరించని వారు ఈ అలెర్ట్‌తో అప్రమత్తమవుతారు. ప్రస్తుతం.. కార్ల ముందు సీట్లలో కూర్చున్న వారికే ఈ సదుపాయం ఉంది. వెనక సీట్లలో వారి కోసం ఏర్పాటు చేసిన సీటు బెల్టులు ధరించకపోయినా ఎలాంటి అలారం మోగే సదుపాయం ప్రస్తుతానికి లేదు. ఇలాంటి వారి కోసం కొన్ని కార్ల తయారీ సంస్థలు త్వరలో అలెర్ట్ చేసే సాంకేతికతను అందుబాటులోకి తేనున్నాయి.

తొలుత అవగాహన కల్పిస్తాం..



ప్రధానంగా హైవేలపై వేగంగా ప్రయాణించే వాహనాలు ప్రమాదాలకు గురైనప్పుడు సీటు బెల్టులు ధరించని వారు ప్రాణాలు కోల్పోతున్నారు. రహదారి భద్రతలో భాగంగా సీటు బెల్టులు ధరించకుండా వాహనాల్లో వెళ్లే వారిపై ఐదేళ్లుగా కేసులు నమోదు చేస్తున్నాం. ఇకపై కార్లలో ముందు, వెనక సీట్లలో కూర్చున్న వారు విధిగా సీటు బెల్టులు ధరించేలా కొన్నాళ్లు వాహనదార్లకు అవగాహన కల్పించనున్నాం. ఆపై ప్రభుత్వ నిబంధనల మేరకు జరిమానాలు విధిస్తాం.

– రాజారత్నం, ఉప కమిషనర్, రవాణాశాఖ, విశాఖ

'స్పందన' అర్జీలకు సత్వర పరిష్కారం

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశం



స్పందనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు చెందిన గిరిజనుల నుంచి 60 దరఖాస్తులు స్వీకరించినట్టు చెప్పారు. ఏజెన్సీలో అన్ని గిరిజన కులాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న డీఎల్‌ఎస్‌సీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, అర్హులైన వాల్మీకి కులస్తులకు కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని జిల్లా వాల్మీకి సంఘం అధ్యక్షుడు చిన్న నారాయణరావు, గొర్లె అనిల్ ప్రసాద్, దూడ విక్టర్ బాబు, డేవిడ్ రాజు అర్జీలు అందజేశారు. రంపచోడవరంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని, మండలంలో ప్రతి పాఠశాలలో సీఆర్టీలను నియమించాలని, ఎయిడెడ్ స్కూళ్లకు పక్కా భవనాలు ఏర్పాటు చేయాలని, పోక్స్‌పేటనుంచి బి.వి.కోట వరకు రోడ్డు వేయాలని రంపచోడవరం ఎంపీపీ బంధం శ్రీదేవి, ఎంపీటీసీ తుర్రం వెంకటేశ్వర్లు దొర, శేఖర్, చిన్నాల దొర వినతిపత్రాలు అందజేశారు. ఏపీవో జనరల్ సీహెచ్ శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు జి.డేవిడ్ రాజు, నాగేశ్వరరావు, ఏపీడీ వెలుగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రెస్టారెంట్‌లు నిబంధనలు పాటించాలి

జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వేణుగోపాల్



విచారణ నిర్వహిస్తున్న వేణుగోపాల్

ముంచంగిపుట్టు: నిబంధనల ప్రకారమే రెస్టారెంట్‌లు నిర్వహించాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వేణుగోపాల్ అన్నారు. నిల్వ,కల్తీ ఆహారం విషయంలో మండల కేంద్రంలోని విలేజ్ స్పైసీ రెస్టారెంట్‌పై ఇటీవల అందిన ఫిర్యాదులపై సోమవారం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి తనిఖీలు నిర్వహించారు. రెస్టారెంట్‌లో వినియోగిస్తున్న పదార్థాలు, పాటిస్తున్న నియయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్థానిక సర్పంచ్ సుభాష్ చంద్ర, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో రెస్టారెంట్ యజమాని వసంతకిషోర్‌ను ఫుడ్ సేఫ్టీ అధికారులు విచారణ జరిపారు. రెస్టారెంట్ లైసెన్స్‌ను పరిశీలించారు. యజమానికి రెస్టారెంట్ నిర్వహణపై సూచనలు చేసి, నిబంధనలను తెలియజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ రెస్టారెంట్‌పై వచ్చిన ఆరోపణలపై ఇప్పటికే ఫుడ్ శాంపిల్ పరీక్షల నిమిత్తం పంపించడం జరిగిందని, రిపోర్ట్ వచ్చేంత వరకు రెస్టారెంట్ నిర్వహించరాదన్నారు. రెస్టారెంట్లు, హోటళ్లలో ఫుడ్ విషయంలో నాణ్యత ప్రమాణాలు లోపిస్తే తక్షణమే తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకరం, ఎంపీపీ సీతమ్మ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు న్యాయం

- వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల ప్రకటనపై సర్వత్రా హర్షాతిరేకాలు
- మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళి
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



చింతపల్లి కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ బాబూరావు, నాయకులు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నేతలు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, నేతలు



జి.మాడుగులలో కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గాయత్రి, నాయకులు



జీకే వీధిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ కుమారి, నేతలు

పాడేరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలను పురస్కరించుకొని ఏజెన్సీలోని అన్ని మండలాల్లో కృతజ్ఞత వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పాడేరులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారితో పాటు పార్టీకి చెందిన ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ము ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందజేస్తూ, అందరి భాందవుడిగా నిలుస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్నారని, పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకాల ద్వారా పేదింటి ఆడపిల్లల వివాహాలకు ఎంతో తోడ్పాడనందిస్తున్నారని చెప్పారు. గిరిజనమంతా మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సరస్వతి, ఎంపీటీసీ సభ్యులు విజయలక్ష్మి, చిట్టమ్మ, నర్సింహామూర్తి, రామకృష్ణ పాత్రుడు, సన్యాసయ్య, సర్పంచ్‌లు చిట్టిబాబు, రాంబాబు, లక్ష్మణరావు, బసవన్నదొర, పార్వతమ్మ, సీతమ్మ, మాజీ ఎంపీపీ రమణమూర్తి, నాయకులు సింహాచలం, కన్నాపాత్రుడు, దశమూర్తి, సూర్యనారాయణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే పాల్గుణ

అరకులోయ రూరల్: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహానేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వైఎస్సార్ కళ్యాణమస్తు పథకం ద్వారా ఎస్టీలకు రూ.1లక్ష, ఎస్సీ ఎస్టీలు, కులాంతర వివాహాలు చేసుకున్న వారికి రూ.1.20లక్ష, బీసీ సామజిక వర్గం వారికి రూ.50 వేలు, బీసి కులాంతర వివాహం చేసుకున్న వారికి రూ.75 వేలు, ముస్లింలకు రూ.1లక్ష ఆర్థిక సాయం అందజేస్తోందన్నారు. వైస్ ఎంపీపీ రామన్న, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, నాయకులు రఘునాథ్, అప్పాలు, సాంబ, వెంకటరావు, బాబూరావు, గురు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం: ఎమ్మెల్యే ధనలక్ష్మి

రాజవొమ్మంగి: జడ్డంగి గ్రామంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తదితరులు మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకాలు పేద కుటుంబాలకు వరం వంటిందన్నారు.

జి.మాడుగుల/గూడెం కొత్తవీధి/చింతపల్లి: అల్లూరి జిల్లా జి.మాడుగుల, గూడెం కొత్తవీధి, చింతపల్లి మండలాల్లో జరిగిన కృతజ్ఞత వేడుకలు ఘనంగా జరిగాయి. జి.మాడుగులలో పాడేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మత్స్యరాస గాయత్రి, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్యకొండం నాయుడు, సర్పంచ్ రాంబాబు, ఎంపీటీసీ విజయకుమారి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ నాగూర్‌బాబు, నాయకులు చిట్టిబాబు, కొండబాబు, మణి తదితరులు పాల్గొన్నారు. జీకే వీధిలో ఎంపీపీ బోయిన కుమారి, వైస్ ఎంపీపీలు ఆనంద్, దేముడు, సర్పంచ్‌లు వంశీకృష్ణ, సుభద్ర, కో-ఆప్షన్ సభ్యుడు దావూర్, పీఏసీఎస్ చైర్మన్ ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు బాబీ, అరుణ్, విష్ణుమూర్తి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. చింతపల్లిలో స్వచ్ఛభారత్ రాష్ట్ర డైరెక్టర్ ఎస్‌కె మీరా, ఎంపీపీ వంతల బాబూరావు, జెడ్పీటీసీ బాలయ్య, సర్పంచ్ పుష్పలత, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జల్లి హలియారాణి, అరుకు పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, మండల పార్టీ అధ్యక్షుడు రవి, ఎంపీటీసీ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ గొడ్డేటి మాధవి, శివప్రసాద్ దంపతులు

సాక్షి, పాడేరు: ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా అఖిల భారతీయ తేరాపత్ యువక్ పరిహద్ ఆధ్వర్యంలో ఈ నెల 17న దేశవ్యాప్త రక్తదాన శిబిరాలను నిర్వహించడం సంతోషంగా ఉందని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి అన్నారు. విశాఖపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో ఈ రక్తదాన శిబిరానికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను ఎంపీ మాధవితో పాటు ఆమె భర్త నేను సైతం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు శివప్రసాద్‌లు ఆవిష్కరించారు. ఎంపీ మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని, యువత ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొవాలని కోరారు.

అనాన్సీ సంస్థపై ఫిర్యాదు

అనంతగిరి: మండలంలోని కొండిబ పంచాయతీ సింగర్బ గ్రామానికి చెందిన గిరిజనుడు సిరగం మహేష్, అనాన్సీ సంస్థపై పోలీస్‌స్టేషన్‌లోని సోమవారం ఫిర్యాదు చేశాడు. తైడ గ్రామంలోని అనాన్సీ సంస్థ ప్రాజెక్టు ప్రారంభించిందని, తన వద్ద నుంచి కిరణా వ్యాపారం నిమిత్తం సామాన్లు ఇచ్చేందుకు, రూ.25వేలు కట్టించారని, అయితే ఇప్పటికీ ఇవ్వలేదని, సంస్థ సభ్యులను అడిగితే స్పందన లేక పోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు మహేష్ తెలిపాడు. నిరుద్యోగినైన నాకు న్యాయం చేయాలని గిరిజనుడు కోరాడు.

బైకు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మునగపాక: మునగపాక సబ్‌స్టేషన్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మునగపాకకు చెందిన పూడి ఆదినారాయణ సోమవారం కూర్మన్నపాలెంలో ఉంటున్న తన కూతురు ఇంటికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బైక్‌పై ఇంటికి వస్తుండగా సబ్‌స్టేషన్‌కు సమీపంలో అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వైపునకు వస్తున్న బైక్ ఢీకొంది. ఈ ఘటనలో ఆదినారాయణ తీవ్రంగా గాయపడ్డాడు.

గిరిజనులకు మెరుగైన వైద్య సేవల కల్పనే లక్ష్యం

- పాడేరు జిల్లా ఆస్పత్రిలో విజయవంతంగా 838 ఆపరేషన్లు
- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాలకృష్ణ



కేక్ కట్ చేస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్: గిరిజనులకు అన్ని రకాలుగా మెరుగైన వైద్యసేవలు కల్పించడమే తమ లక్ష్యమని పాడేరు ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ అన్నారు. సోమవారం ఆయన పాడేరు జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు, మౌలిక సదుపాయాలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తాను పాడేరు ఐటీడీఏ పీవోగా భాద్యతలు స్వీకరించిన తర్వాత పాడేరు జిల్లా ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలకు అవసరమైన ఆపరేషన్ థియేటర్, ఇతర మౌలిక వసతులు కల్పించానన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు సుమారు 838 మేజర్, మైనర్ సర్జరీలు విజయవంతంగా నిర్వహించామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివశంకర ప్రసాద్ ఐటీడీఏ పీవోకు వివరించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు, ఇతర సిబ్బందిని ఐటీడీఏ పీవో అభినందించారు. అనంతరం 838 శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించడంపై సంతోషం వ్యక్తం చేస్తూ కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రవి కిరణ్, ఆస్పత్రి సిబ్బంది, పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబుకు వినతిపత్రం ఇస్తున్న గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు

అరకులోయ రూరల్: మండలంలోని గద్యగూడలో సోమవారం పర్యటించిన ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబును గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో స్పెషల్ డీఎస్సీ ద్వారా ఏజెన్సీలో వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయ, వైద్య, ఆరోగ్య శాఖల్లో పోస్టులను భర్తీ చేయాలని కోరారు. జీవో నంబర్-3 పునరుద్ధరించి, గిరిజన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతిలో కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు నందో, నారాయణ, బుజ్జిబాబు తదితరులున్నారు.

సకాలంలో భవన నిర్మాణాలు పూర్తి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశం



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: నూతనంగా చేపట్టిన ప్రభుత్వ భవనాల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఇంజినీర్లను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో సోమవారం సంక్షేమశాఖ ఇంజినీర్లు, ఉపాధి హామీ పథకం ఏపీడీలు, ఏపీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న భవనాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఏఈ జి.డేవిడ్ రాజ్, డీఇ గౌతమి, ఉపాధి హామీ పథకం ఏపీడీలు కె.చిట్టిబాబు, భాగ్యరావు తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య



ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న మహేష్

వీఆర్‌పురం: ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్న ఘటన మండల పరిధి వీరపాపనకుంట గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సున్నంవారిగుడెం గ్రామానికి చెందిన గొంది మహేష్(24)కు సమీప గ్రామంలోని చినమట్టపల్లి గ్రామానికి చెందిన మహేశ్వరికి ఏడాది క్రితం వివాహం అయ్యింది. ప్రస్తుతం భార్య గర్భవతి కావడంతో కాన్పు కోసం పుట్టిల్లు చినమట్టపల్లికి వెళ్లింది. దీంతో మహేష్ ఇంటి వద్దనే ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి రాలేదు. ఈ క్రమంలో ములకనపల్లి పంచాయతీ వీరపాపనకుంట గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాలలోని రేకుల షెడ్డులో వ్యక్తి ఉరివేసుకొని మృతి చెందాడని ఎస్ఐ టి.దుర్గాప్రసాద్‌కు సమాచారం అందింది. దీంతో సిబ్బందితో వెళ్లి ఆయన పరిశీలించి విచారించగా ఉరివేసుకొని మృతి చెందింది మహేషేనని గుర్తించారు. ఇదిలా ఉండగా భార్య మహేశ్వరి ఆదివారం భద్రాచలం ఆస్పత్రిలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

గిరిజన సంక్షేమ డైరెక్టర్‌ను కలిసిన ట్రైకార్ చైర్మన్



గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ జాహ్నవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు

సాక్షి,పాడేరు: గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా ఇటీవల నియమితులైన జాహ్నవిని సోమవారం అమరావతిలో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏజెన్సీలో ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలతో పాటు గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు సతక బుల్లిబాబు స్థానిక విలేకరులకు తెలిపారు.

నిలిచిన బ్యాంకు సేవలు: తప్పని ఇక్కట్లు

మారేడుమిల్లి: గ్రామంలోని యూనియన్ బ్యాంక్ సేవలు నాలుగు రోజులుగా పనిచేయడం లేదు. ఏటీఎం కూడా మూతపడింది. బీఎస్ఎన్ఎల్ బ్రాండ్ బ్యాండ్ నెట్‌వర్క్, యూపీఎస్‌లు పాడవడంతో సేవలు నిలచిపోయినట్టు సిబ్బంది తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు నెట్ పనిచేయకపోవడంతో తిరిగి వెళ్తున్నామని స్థానికులతో పాటు వై.రామవరం లోతట్టు ప్రాంత ఖాతాదారులు చెబుతున్నారు. ఏటీఎం మూతపడడంతో వారు డబ్బులు కోసం అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి త్వరగతిని సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణకు ఆసక్తి చూపాలి

కలెక్టర్ సుమిత్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్రంలో ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ మత్స్యలింగం

హుకుంపేట: వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందేందుకు గిరిజన యువతీ యువకులు ఆసక్తి చూపాలని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. వాటి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని చెప్పారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం నాబార్డ్ సంస్థ సహకారంతో సృజన స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన 30రోజుల వృత్తి నైపుణ్య కోర్సుల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని యువకులకు అవగాహన కల్పించారు. సంస్థ అందించిన పనిముట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ ద్వారా అందిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం,ఎంపీడీవో వెంకటరమణ,తహసీల్దార్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం

- మిస్సింగ్ కేసు..హత్య కేసుగా మార్పు
- నలుగురు నిందితులు అరెస్ట్



లక్ష్మణరావు మృతదేహానికి పంచనామా నిర్వహిస్తున్న దృశ్యం



అరెస్ట్ చేసిన నిందితులతో అడ్డతీగల సీఐ రాంబాబు ఎస్ఐ సంతోష్‌కుమార్ తదితరులు

అడ్డతీగల: దాదాపు మూడు మాసాలుగా కనిపించకుండా పోయిన తన అన్న ఆచూకీ కనిపెట్టాలంటూ సోదరుడు చేసిన ఫిర్యాదుపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు చాకచక్యంగా దర్యాప్తు చేపడితే విస్తుగొలిపే నిజాలు బయటపడ్డాయి. వివాహేతర సంబంధం కారణంగా వ్యక్తిని హత్యచేసినట్టు రుజువు అయ్యింది. అడ్డతీగల సీఐ వై.రాంబాబు సోమవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డి.కొత్తూరుకి చెందిన కాకూరి లక్ష్మణరావు గత జూన్ 17 నుంచి కనిపించడం లేదని ఈనెల 9న అతని సోదరుడు కాకూరి ధర్మరాజు దుశ్చర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. దీనిపై అక్కడి ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసు దర్యాప్తులో ఉండగా సోమవారం అనుమానితులైన లక్ష్మణరావు భార్య కాకూరి లక్ష్మి, దళం రాజుబాబు, బచ్చల అబ్బాయిరెడ్డి, ముర్ల బాలురెడ్డి డి.రామవరం వీఆర్వోతో కలిసి వచ్చి దుశ్చర్తి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారన్నారు. కాకూరి లక్ష్మణరావుని జూన్ 17న చంపి వేసి శవాన్ని డి.రామవరం శివారున పడవేసినట్టు నేరం ఒప్పుకున్నారన్నారు. ఈ సమాచారం ఆధారంగా డి.రామవరం శివారున కాకూరి లక్ష్మణరావు మృతదేహానికి సోమవారం శవపంచనామా నిర్వహించామన్నారు. నిందితులపై హత్యా నేరం కింద కేసుని మార్పుచేసి నలుగురుని అరెస్ట్ చేశామన్నారు. మృతుని భార్య కాకూరి లక్ష్మికి, దళం రాజుబాబుకి మధ్య వివాహేతర సంబంధం విషయం మృతునికి తెలిసిపోయినందున లక్ష్మి, దళం రాజుబాబు పథకం పన్ని బచ్చల అబ్బాయిరెడ్డి, ముర్ల బాలురెడ్డి సహాయంతో లక్ష్మణరావును హత్య చేసినట్టు దర్యాప్తులో నేరం అంగీకరించారన్నారు.

రెండు బైకులు ఢీకొని నలుగురికి గాయాలు



రంపచోడవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

రంప చోడవరం: ఉసిరిజొన్నలు గ్రామ సమీపం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివి. కూనవరం గ్రామానికి చెందిన వినోద్, ప్రకాష్ అనే ఇద్దరు వ్యాపారులు బైకుపై కూనవరం నుంచి వై.రామవరం వెళ్తున్నారు. రంపచోడవరం మండలం బి.వెలమలకోట గ్రామానికి చెందిన కారం సత్యనారాయణ దొర రంపచోడవరంలో హోమ్ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. అతని సమీప బంధువైన భవానీతో కలిసి బైకుపై రంపచోడవరం వస్తుండగా ఉసిరిజొన్నలు వద్ద ఇరు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన వారిని స్థానికులు 108 అంబులెన్స్‌లో రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో వినోద్, హోమ్ గార్డు సత్యనారాయణ దొర పరిస్థితి విషమంగా ఉండడంతో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. రంపచోడవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



వ్యాపారులతో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్

అరకులోయ రూరల్: స్థానిక మార్కెట్ యార్డును మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్ సోమవారం సందర్శించారు. దుకాణాల వద్ద ధరల పట్టికలు లేకుండా విక్రయించడంపై వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారస్తులు తప్పనిసరిగా మార్కెట్ ధరల ప్రకారం విక్రయించాలని, ధరల పట్టికలు ఉండాలని, తూకాల్లో మోసం లేకుండా చూడాలన్నారు. మార్కెట్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైస్ ఎంపీపీ రామన్న, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాసి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై సమీక్ష



ఎంపీడీవోతో సమీక్షిస్తున్న ప్రజాప్రతినిధులు

వై.రామవరం: పి.యర్రగొండ గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, ఎంపీడీవో అశోక్‌కుమార్ పాల్గొని కార్యక్రమం నిర్వహణపై చర్చించారు. కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటున్నారని, అధికారులు, పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

షాపుల అద్దె గడువు పొడిగింపు

రంపచోడవరం: ఐ.పోలవరం పర్యాటక పార్కు వద్ద నిర్మించిన షాపుల అద్దె గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడగించినట్లు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే సోమవారం ప్రకటనలో తెలిపారు. సక్తి గల వారు షాపుల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుతో పాటు ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఫోన్ నంబర్, వ్యాపార వివరాలను 20వ తేదీ లోగా ఐటీడీఏ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. 23వ తేదీన షాపుల వేలంపాట నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

హమాలీల ర్యాలీ

జి.మాడుగుల: స్థానిక జీసీసీ ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జీసీసీ హమాలీలు సోమవారం ర్యాలీ నిర్వహించారు. కొత్త కూలీ రేట్లు అమలుచేయాలని, కార్మిక చట్టాలు అమలుచేయాలని కోరారు.

రహదారి కోసం వినతి



ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మారేడుమిల్లి: చట్లవాడ గ్రామానికి రోడ్డు నిర్మించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు స్మిత్ ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేకు సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు అధ్వానంగా మారిందని, రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు పీవోకు వివరించారు. దీనిపై పీవో తక్షణమే స్పందించి ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి, రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని, నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్టు నాయకులు స్మిత్ చెప్పారు.

పాఠశాలకు ఉపాధ్యాయుడి నియామకం

గూడెంకొత్తవీధి : పాడేరు ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ చొరవతో ఎట్టకేలకు మండలంలోని చిన్న అగ్రహారం ఎంపీపీ పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించినట్టు ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి, కో-ఆప్షన్ సభ్యుడు దావూద్ సోమవారం విలేకరులకు తెలిపారు. చిన్న అగ్రహారంలో పర్యటించిన సమయంలో ఎంపీపీ పాఠశాలకు భవనం, ఉపాధ్యాయుడు లేని విషయాన్ని ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై స్పందించిన పీవో లక్కవరపుపేట పాఠశాలలో పనిచేస్తున్న కె.శ్రీనివాసరావును చిన్న అగ్రహారం పాఠశాలకు నియమిస్తు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. పాఠశాల భవనం కూడా మంజూరు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా కృషి చేస్తామని వారు తెలిపారు.

మన్యప్రాంత అభివృద్ధే ధ్యేయం



బొడ్డాపుట్టులో గిరిజనులకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, చిత్రంలో ఎంపిపి కూడా రాజుబాబు, జెడ్పీటీసీ మత్స్యలింగం

- అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: ఏజెన్సీ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, శివారు గ్రామాల్లో సైతం మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాడిపుట్టు పంచాయతీ బొడ్డాపుట్టు, ఉ‌బ్రాడ, నిమ్మలపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ స్థానిక నాయకులతో కలిసి సోమవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లోని 170 గడపలను ఆయన సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు, సంక్షేమ పథకాల అమలుతీరును, గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన్యప్రాంత అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గిరిజనులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తాగునీరు, రోడ్డు సమస్యను పలువురు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. దీనిపై ఆయన స్పందించి, సమస్య వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం, ఏపీవో లింగమూర్తి, ఎంపీటీసీ సభ్యులు సింహాచలం, నాగరాజు, కొండమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, సర్పంచ్‌లు బొంజిబాబు, వెంకటపూర్ణిమ, సాంబ, లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొండబాబు, నాయకులు చినసత్యం, రవిప్రసాద్, బొంజుబాబు, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

డుంబ్రిగుడ: కొర్రాయి పంచాయతీ పెద్ద అంజోడ, బొందుగుడ, సాయినగర్, భల్లుగుడ, జాకరవలస, జాముగుడ, గుంజిరిగుడ తదితర గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి గౌతమ్ మాట్లాడుతూ సర్పంచ్ పూజారి కొములు సూచనల మేరకు ఆయా గ్రామాల్లో 214- పశువులకు, 214-గొర్రెలకు, 120 మేకలకు పరీక్షలు చేసినట్టు చెప్పారు. పశువ్యాధులపై రైతులకు అవగాహన కల్పించి, మందులు అందజేసినట్టు తెలిపారు. మనోజ్, అప్పారావు, సంజీవ్, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: గోమంగి, గుల్లేలు పంచాయతీల్లో కప్పలగొంది, సంగంవలస, సీమకొండ, జంగంపట్టు, కుమ్మరివీధి, గోమంగి గ్రామాల్లో సోమవారం నిర్వహించిన శిబిరాల్లో188 పశువులకు వైద్య పరీక్షలు చేసినట్టు వెటర్నరీ అసిస్టెంట్ ధన్నేరావు చెప్పారు. పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు అందజేశారు. గణేష్, స్వామి, మనోజ్, దేవ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

వై.రామవరం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బి.అశోక్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అన్ని ప్రభుత్వశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఆప్యాయంగా పలుకరిస్తూ.. అర్జీలు స్వీకరిస్తూ



దోనెలపాలెంలో గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రాజవొమ్మంగి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులందరికీ పథకాలు అమలుచేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని గడుటకుర్తి పంచాయతీ దోనెలపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, నేతలతో కలిసి గ్రామంలో సుమారు 120 గడపలను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించి, సంక్షేమ పథకాలు అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. గిరిజనులు సమస్యలపై అందించిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించడమే తమ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల అభ్యున్నతి కోసం విశేష కృషి చేస్తున్నారన్నారు. భూముల మ్యూటేషన్, బియ్యం కార్డు మంజూరు, చేయూత, విద్యా దీవెన పథకాల కోసం, శాశ్వత గృహాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం తదితర సమస్యలపై పలువురు వినతిపత్రాలను ఎమ్మెల్యే ధనలక్ష్మికి అందజేశారు. డ్వాక్రా రుణాలు, రైతు భరోసా నగదును బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు పాత బకాయిలకు జమ చేస్తూ పథకాల సొమ్ము ఇవ్వడం లేదని కొంతమంది ఫిర్యాదు చేశారు. సమస్యలన్నింటిని పరిష్కరిస్తానని ఎమ్మెల్యే ధనలక్ష్మి హామీ ఇచ్చారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి, సర్పంచ్ చంద్రుడు, నాయకులు వెంకటేష్‌రాజు, మురళీకృష్ణ, శాంతకుమారి, కుశరాజు, జాన్‌బాబు, కామేష్, రవి తదితరులు పాల్గొన్నారు.తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి, ఎంపీడీవో బాపన్నదొర, సీఐ రవికుమార్, ఎస్ఐ షరీఫ్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

భారీ అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

సాక్షి, పాడేరు: లోచలిపుట్టులో వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, సర్పంచ్ ఉషారాణితో పాటు ఉత్సవ కమిటీ ప్రతినిధులు సుబ్బారావు, కొండాజి, రమేష్‌తో పాటు సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు. సాయంత్రం 4గంటల వరకు జరిగిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు.

రాజ్‌మా విత్తనాల పంపిణీ



అన్నవరంలో రైతులకు రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ బాబూరావు



కడుగులలో రైతులకు రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న సీఐ అశోక్‌కుమార్, సర్పంచ్ లక్ష్మి

చింతపల్లి: అన్నవరం ఆర్‌బీకేలో రైతులకు ఎంపీపీ వంతల బాబూరావు రాజ్‌మా విత్తనాలు సోమవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్‌లు సన్యాసిరావు, లక్ష్మయ్య, అగ్రికల్చర్ అసిస్టెంట్ నాగశంకర్, మహిళా పోలీస్ కళావతి తదితరులున్నారు.

గూడెంకొత్తవీధి: రింతాడ పంచాయతీ కడుగుల గ్రామంలోని ఆర్‌బీకేలో గిరిజన రైతులకు రాజ్‌మా విత్తనాలను సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ అప్పలసూరి పంపిణీ చేశారు.సీఐ అశోక్‌కుమార్ మాట్లాడుతూ గిరిజనుల గంజాయి సాగుకు దూరంగా ఉండి, వాణిజ్య పంటలను పండించాలని సూచించారు. సర్పంచ్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ సేవలు



పేదలకు భోజనం అందజేస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరం వారపు సంతలో సోమవారం సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అదనపు పోలీసు బలగాల ఆధ్వర్యంలో 160 మంది పేదలకు భోజనం, వాటర్ ప్యాకెట్లు అందజేశారు. అసిస్టెంట్ కమాండెంట్ నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటమణ సిబ్బంది, పాల్గొన్నారు.

చింతపల్లి మండల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బాలకిషోర్



చింతపల్లి రూరల్ : పంచాయతీరాజ్ శాఖ మండల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా కె.బాలకిషోర్ నియమితులయ్యారు. స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయంలో ఈఈ పోస్టు కొంతకాలంగా ఖాళీగా ఉంది. దీంతో జి.కె.వీధి పీఆర్ ఈఈ జ్యోతిబాబు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజాగా ఏపీపీఎస్సీ నియామకాల ద్వారా ఎంపికైన బాల కిషోర్‌కు తొలి పోస్టింగ్ చింతపల్లి ఇచ్చారు. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

ఆత్మీయ సన్మానం



హెచ్ఎం మల్లీశ్వరీని సన్మానిస్తున్న జెడ్పీటీసీ గంగరాజు, సర్పంచ్‌లు, తదితరులు



సర్వేయర్ లక్ష్మణరావు, వీఆర్‌వో భారతిను సన్మానిస్తున్న తహసీల్దార్ శ్రీమన్నారాయణ తదితరులు



పీటీ తిరుపతిరావు దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

అనంతగిరి: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల-1 పాఠశాల హెచ్ఎం మల్లీశ్వరి, కొత్తవలస బాలుర పాఠశాల పీడీ రఘు, బొర్రా బాలుర పాఠశాలకు చెందిన భాస్కరరావులు ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నారు. వారిని జెడ్పీటీసీ గంగరాజు సోమవారం సన్మానించారు. సర్పంచ్‌లు రూతు, మోస్య, హెచ్ఎం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: రెవెన్యూశాఖలో సర్వేయర్‌గా పనిచేసి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేగా పదోన్నతి పొందిన లక్ష్మణరావు, వీఆర్‌వోగా పనిచేసి బదిలీపై వెళ్తున్న భారతిలను తహసీల్దార్ శ్రీమన్నారాయణ, డీటీ రామకృష్ణ, ఆర్ఐ జిలానీ బాష తదితరులు సోమవారం సన్మానించారు. ఆముదాలబందలో జరిగిన కార్యక్రమంలో స్థానిక పాఠశాల పీడీ చలపతిరావును గ్రామస్తులు సన్మానించారు. ఆయన ఇటీవల ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందారు.

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నేతలు

కొయ్యూరు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకాలు పేదంటి ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సాయమందిస్తాయన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పార్టీ శ్రేణులు, గ్రామస్తులు క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ఎంపీపీ నూకాలు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముసిలినాయుడు,ఎంపీటీసీ గంగాభవాని, సావిత్రి, సత్యారావు, శేఖర్, చిన్నారావు, నాయకులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

మారేడుమిల్లి: రిసార్ట్స్, గెస్ట్ హౌస్‌ల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాము హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం రిసార్ట్స్, గెస్ట్ హౌస్‌ల యజమానులకు నోటీసులు జారీ చేశారు. పర్యాటకులకు గదులు అద్దెకు ఇచ్చినప్పుడు వారి నుంచి ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తీసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలన్నారు. మద్య సేవించిన, పేకాట ఆడిన తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రిసార్ట్, గెస్ట్ హౌసులకు సంబంధించిన వివరాలను రోజు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

బాధితులకు న్యాయం చేయాలి

వీఆర్ పురం: తప్పుల తడకగా వరద నష్ట సర్వేను చేశార ని వడ్డిగూడెం, వీఆర్ పురం వరద బాధితులు రేఖపల్లి జంక్షన్‌లో సోమవారం ఆందోళన చేశారు. వరదలకు వడ్డిగూడెంలో నష్టపోయిన బాధితుల పేర్లు కాకుండా అనర్హుల వివరాలను సర్వేలో పొందుపరిచారని ,ఉన్నతాధికారులు స్పందించి అర్హులైన బాధితులకు పరిహారం అందజేయాలని కోరారు.

పరిహారం కోసం వినతి

రాజవొమ్మంగి: లోదొడ్డి గ్రామంలో గతేడాది జీలుగ కల్లులో విష ప్రయోగం సంఘటనలో మృతుల కుటుంబాలకు సీఎం సహాయ నిధి అందజేయాలని బాధితులు ఎమ్మెల్యే ధనలక్ష్మిని విన్నవించుకున్నారు. జడ్డంగి పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యేను ఆయా బాధిత కుటుంబాలు కలిసి సమస్యను వివరించారు. ఆమె స్పందించి త్వరలో సమస్య పరిష్కరిస్తామన్నారు.

గెడ్డ దాటాలంటే.. సంకటమే



బైక్‌ను మోస్తూ కోడిమామిడి గెడ్డను దాటుతున్న గిరిజనులు

జి.మాడుగుల: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో జి.మాడుగుల-కిల్లంకోట మార్గంలో కోడిమామిడి గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. కిల్లంకోట, మద్దిగరువు పంచాయతీ పరిధిలో గ్రామాల చేరేందుకు గత్యంతరం లేక నిత్యం గెడ్డ దాటాల్సి వస్తోంది. కిల్లంకోట నుంచి అత్యవసర పనులు నిమిత్తం సోమవారం వస్తుండగా ఈ గెడ్డ ప్రమాద స్థాయిలో ప్రవహిస్తుంది. బైక్‌ను ముగ్గురి సాయంతో గెడ్డను దాటించారు. అరచేతిలో ప్రాణాలతో తరచూ ఇలాంటి సాహసాలు తప్పడం లేదంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గెడ్డపై వంతెన నిర్మించాలి కోరుతున్నారు.

ఆరోగ్యభద్రతపై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో దీప్తి

వై.రామవరం: పోషణ అభియాన్ మాసోత్సవాల్లో భాగంగా దాలిపాడు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల సోమవారం జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో వి.దీప్తి ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఆరోగ్య భద్రత, పరిశుభ్రత, సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. కిషోర బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఏటీడబ్ల్యూవో హాసిని, ఎంఈవో కె.తాతబ్బాయిదొర, హెచ్ఎం నాగలక్ష్మి, సూజర్‌వైజర్ సుందరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారం కోసమే టీడీపీ పాకులాట

చింతపల్లి రూరల్: ప్రచారం కోసమే టీడీపీ నాయకులు పాకులాడుతున్నారని జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య అన్నారు. టీడీపీ నాయకులు అన్నా క్యాంటీన్ పేరుతో ఒక పూట భోజనం పెట్టి మూసివేయడం సిగ్గు చేటన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనను చూసి టీడీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పుష్పలత, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి ఉన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు



రోగులకు వైద్య సేవలందిస్తున్న వైద్యులు

గంగవరం: నెల్లిపూడి గ్రామంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. టీఎంసీ అసోసియేషన్ గోకవరం ఏజెన్సీ మండల నాయకుడు సుంకర దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరాన్ని సర్పంచ్ కె.రమణమ్మ ప్రారంభించారు. డాక్టర్లు చైతన్య, ప్రియాంక గ్రామస్తులు వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేసినట్టు నిర్వాహకులు తెలిపారు. మాజీ సర్పంచ్ వెంకాయమ్మ, మండల కోఆప్షన్ సభ్యుడు ప్రభాకర్‌రావు, టీఎంసీ అసోసియేషన్ ప్రతినిధులు చిన్ని, వైద్యులు నాగేశ్వరరావు, లాజర్, పవన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంప హెచ్ఎం వితరణ



కొనుగోలు చేసిన టీవీ, వాలీబాల్ కిట్లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొయ్యూరు: మంప హెచ్ఎంగా బాధ్యతలు స్వీకరించిన జర్త సత్తిబాబు సోమవారం విద్యార్థుల కోసం తన సొంత నిధులు రూ.20 వేలతో టీవీ, వాలీబాల్ కిట్లను కొనుగోలు చేశారు. దీనిపై ఉపాధ్యాయులు గణబాబు, నర్సింహమూర్తి, రవి, శ్రీనివాసరావు తదితరులు అభినందనలు తెలిపారు. ఎస్ఎంసీ తరఫున హెచ్ఎంకు కృతజ్ఞతలు తెలిపారు. హెచ్ఎం సత్తిబాబు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, ఈ మేరకు వారి కోసం వాలీబాల్, టీవీని కొనుగోలు చేసినట్టు చెప్పారు. చదువులో విద్యార్థులు బాగా రాణించేలా చూస్తామన్నారు.

రాయాలయ నిర్మాణ పనులు ప్రారంభం



ఆలయ నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

జి.మాడుగుల: గొడుగుమామిడి గ్రామంలోతిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణీ ట్రస్టు నిధులతో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ గొర్లె గణేశ్వరరాజు ఆధ్వర్యంలో సీతారామాలయం నిర్మాణ పనులకు సోమవారం భూమి పూజ చేశారు. పనులను ఫౌండేషన్ మండల కన్వీనర్ మత్స్యరాజు, సభ్యులు నీలకంఠం, గంగాచారి పర్యవేక్షించారు. సర్పంచ్ చిన్నకుమారి, ఫౌండేషన్ సభ్యులు వెంకటగిరి, లక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలలో పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న నేతలు

కొయ్యూరు: వెలగలపాలెం పంచాయతీ కిత్తాబు గ్రామంలో పాఠశాల అదనపు గదుల నిర్మాణ పనులకు సోమవారం ఎంపీటీసీ సోమాగాంధీ, సర్పంచ్ రత్నకుమారితో పాటు నేను సైతం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు కె.శివప్రసాద్ శంకుస్థాపన చేశారు. గతంలో ఈ ప్రాంతానికి కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి ఎంపీ మాధవి కాలినడకన పర్యటించారని, ఈ నేపథ్యంలో పాఠశాల భవన నిర్మాణానికి నిధుల కోసం ఎంపీ హామీ ఇచ్చారని శివప్రసాద్ చెప్పారు. ఇచ్చిన హామీని ఎంపీ నెరవేర్చడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు



బూరుగుచట్టులో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో సాయినవీన్

పాడేరు రూరల్: కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో సలుగు పంచాయతీ బూరుగుచట్టు, సప్పిపుట్టు, గబ్బంగి, కొత్తాబు తదితర గ్రామాల్లో ఎంపీడీవో కె.సాయినవీన్ సోమవారం పర్యటించారు. గ్రామాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. చిన్నారులతో ముచ్చటించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పాఠశాలల భవనం కోసం గిరిజనులు ఎంపీడీవోకు విన్నవించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. డోకులూరు గ్రామ సచివాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ వెంకటరావు

డుంబ్రిగుడ: పోతంగి పంచాయతీ కేంద్రంలో సోమవారం డ్రైనేజీల్లో పూడికతీత కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ వెంకటరావు పనులు పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శి ధర్మ తదితరులున్నారు.

మెనూ అమలుచేయాలి



పెదబయలులో మాట్లాడుతున్న ఎంఈవో సింహాచలం



మాట్లాడుతున్న ఎంఈవో మల్లేశ్వరరావు

గంగవరం: మండలంలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు, పారిశుధ్య కార్మికులకు ఎంఈవో వై.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందజేయాలని, పాఠశాలల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలని సూచించారు.

పెదబయలు: మండల కేంద్రంలోని మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులకు సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంఈవో కె.సింహాచలం పలు సూచనలిచ్చారు. మెనూ అమలుచేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.